క్లుప్తంగా

అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడటౌన్: గుడివాడ నియోజకవర్గ పరిధిలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.విజయ ఫ్లారెన్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ అర్బన్ పరిధిలో 6, రూరల్ పరిధిలో 2, నందివాడలో 1, గుడ్లవల్లేరులో 1 కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి పాసై జూలై 1వ తేదీ నాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థినులు స్థానికులై ఉండి విద్య, కుల ధ్రువీకరణ, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరించిన జిరాక్స్ కాపీలు జతచేయాలన్నారు. తమ దరఖాస్తులను అక్టోబర్ 5వ తేదీలోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం, ఎమ్మార్వో కార్యాలయం ఎదుట, గుడివాడ – 521301 చిరునామాకు దరఖాస్తులు అందజేయాలని కోరారు.

బైజూస్ ట్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోండి

పమిడిముక్కల: ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన బైజూస్ ట్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి మహమ్మద్ దావూద్ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో శనివారం బైజూస్ ట్యాబ్స్ వినియోగంలో సమస్యలు, వాటి పరిష్కారాలపై ఉన్నత, ప్రాథమికోన్నత, నోడల్ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ట్యాబ్‌లు పగిలిపోయినప్పుడు సచివాలయంలో అందజేసి ఎకనాలెడ్జిమెంట్ తీసుకోవాలన్నారు. ట్యాబ్ పోయినప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ అధికారులకు అందజేయాలని సూచించారు. ఎస్డీ కార్డు, క్యూఆర్ కోడ్ స్కాన్‌కు సంబంధించిన సమస్యలకు ఎంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. ట్యాబ్‌లో ఇచ్చిన యాప్‌లు పనిచేయనప్పుడు ఫ్యాక్టరీ రీ సెట్టింగ్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, ఈవోఆర్డీ వెంకటేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పెదపారుపూడి: మండలంలోని కొర్నిపాడు గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్ట్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ శనివారం తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శి సంప్రదించి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



కైకలూరు(కలిదిండి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కలిదిండి మండలం ఆరుతెగళపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్–17, 14 విభాగాల్లో ఎం.ఈశ్వర్‌కుమార్, బి.సంతోష్ అర్హత సాధించారు. క్రీడాకారులను, పీడీ లూయిస్‌ను హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు.

ఉత్సాహంగా సాహితి, సాంస్కృతిక పోటీలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ రజతోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి సాహితి, సాంస్కృతిక పోటీలు శనివారం కొనసాగాయి. అనంతరం విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణ, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎరువులు వాడొద్దు

ముదినేపల్లిరూరల్: మండలంలో వరిసాగు చేస్తున్న రైతుల పరిమితికి మించి ఎరువులు వాడొద్దని వ్యవసాయధికారి బి.వేణుమాధవ్ రైతులకు సూచించారు. మండలంలోని పెదపాలపర్రు, కోడూరులో శనివారం ఆయన పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వరినాట్లు వేసి 70 రోజులు పూర్తవుతున్నందున కాంప్లెక్స్ ఎరువులు వాడరాదన్నారు. ఈ దశలో యూరియా, పొటాష్ ఎరువులు కలిపి చల్లుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు రైతుల ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసి వివరాలను రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలన్నారు.

రాజగోపురం నిర్మాణానికి సన్నాహాలు

ముదినేపల్లిరూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి జగన్నాథస్వామి ఆలయానికి మహారాజ గోపురం నిర్మాణానికి సంబంధించి దేవదాయ శాఖ ఇంజినీర్లు శనివారం స్థల నిర్ధారణ చేశారు. ఈ ఆలయానికి 7 అంతస్తుల రాజగోపురం నిర్మించేందుకు దేవదాయశాఖ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఆలయ చైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, కార్యనిర్వహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే దాతల సహకారంతో గ్రామ ప్రవేశ రహదారి వద్ద మహాద్వార నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయ విజ్ఞాన సదస్సుల్లో జడ్జిలు



తాడంకి హైస్కూల్‌లో మొక్క నాటిన జడ్జి శ్రీహరి తదితరులు

మొవ్వ: విద్యార్థులు చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని, చట్టాలపై మక్కువ పెంచుకుని న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా ఎదగాలని మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజన్ ఉదయ్ ప్రకాష్ సూచించారు. మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో నిర్వహించారు. కళాశాల యాంటీ ర్యాగింగ్, కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్ పాల్గొన్నారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి విద్యార్థులకు న్యాయపరమైన సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేఆర్ మంజుల, నాక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎల్వీ కృష్ణారావు, కోర్టు కానిస్టేబుల్ కృష్ణ, లాయర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్నార్ కళాశాలలో..

గుడివాడటౌన్: విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.నాగలక్ష్మి అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో శనివారం విద్యార్థులకు మానవ అక్రమ రవాణా వ్యతిరేకత అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉంటే సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు సమస్యలు తలెత్తకుండా జీవించవచ్చునన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు, మహిళలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు కొందరు తప్పనిసరిగా కొన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. పిల్లలు, మహిళల అక్రమ రవాణా తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుందని చెప్పారు. దీనికి 10 ఏళ్ల పైబడి జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రమీలాదేవి, శివరామకృష్ణ, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, లైబ్రేరియన్ టీఎస్ఎస్ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగలక్ష్మి



మొవ్వ డిగ్రీ కాలేజీలో మాట్లాడుతున్న జడ్జి రాజన్ ఉదయ్ ప్రకాష్

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పమిడిముక్కల: అపరిచితులతో పరిచయం పెంచుకోకూడదని, అప్రమత్తంగా ఉండాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీహరి సూచించారు. తాడంకి హైస్కూల్‌లో శనివారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్లలో ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల జోలికి వెళ్లకూడదన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శివనాగప్రసాద్, ఉయ్యూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.గోపిచంద్, ఏఎస్ఐ ఆనందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం

కైకలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అందించే పోషకాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ ఆనంద్ చెప్పారు. వెలంపేట కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద పోషకాహారంపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. మహిళలకు 10 రకాల పోషకాహార పదార్థాలతో కూడిన సరుకులను కిట్ల రూపంలో అందించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య బాలామృతం, చిరుధాన్యాల ఆవశ్యకతను తల్లులకు వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు మూడేడ్ల శశికళ, మహిళా సంరక్షణ కార్యదర్శి సరూప్య, ఎంఎస్‌కే స్వాతిప్రియ, అంగన్‌వాడీ కార్యకర్తలు మీనాకుమారి, ఉషా, కళ్యాణి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



కైకలూరులో మాట్లాడుతున్న సీడీపీఓ ఆనంద్

పోషకాహార పంపిణీ....

గుడ్లవల్లేరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార విలువలతో పోషకాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అంగన్‌వాడీలకు సంపూర్ణ పోషకాహార మాసోత్సవాలపై అవగాహనా సదస్సును చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ సుల్తానా, సీడీపీఓ శ్రీవాణి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

కొర్నిపాడు(పెదపారుపూడి): మండలంలోని కొర్నిపాడు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకమాహ్‌పై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. చిరుధాన్యల వల్లన కలిగే లాభాలను తెలిపారు. గ్రామ సర్పంచ్ దూడల లోకేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పమిడిముక్కలలో మాట్లాడుతున్న ఝాన్సీరాణి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: చోరగుడి సచివాలయం పరిధిలోని అంగనవాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆకు కూరల్లోని పోషక విలువలపై కృష్ణాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి గర్భిణులు, బాలింతలకు వివరించారు. సర్పంచ్ కందిమళ్ల పూర్ణ కుమారి, కార్యదర్శి రమణ, అంగనవాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపిక

పామర్రు: త్వరలో జరగబోయే జిల్లా స్థాయి యోగా పోటీలకు తమ హైస్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పామర్రు జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం సామ్రాజ్యం తెలిపారు. స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన నియోజకవర్గ కేంద్రంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సెలక్షన్‌లలో 6వ తరగతికి చెందిన కావ్యామృత, రేవతి, రోజా, అమర్, సుభాని, మహీధర్‌లు ఎంపిక అయ్యారన్నారు. వీరు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి యోగా సెలక్షన్‌లలో పాల్గొంటారని తెలిపారు. విజేతలను, వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు మురళి, రవికిషోర్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి హెచ్ఎం సామ్రాజ్యం

28న సాయి మందిరం ప్రారంభం

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెం గ్రామంలోని షిర్డీ సాయి మందిరం ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తామని నిర్మాణకర్తలు సాయి పురోహిత్ పద్మావతి, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. సాయి కోటి నామ లిఖిత మహా యజ్ఞం, అఖండ సాయి నామ సంకీర్తన జరుగుతాయన్నారు. ఉదయం 10.30 గంటలకు మూడు కోట్ల సాయి నామం గల సాయికోటి పుస్తకాలతో ఊరేగింపు, అనంతరం వాటిని ప్రత్యేకంగా నిర్మించిన స్తూపంలో నిక్షిప్తం, విగ్రహ ప్రతిష్ఠ, సామూహిక సాయి సత్య వ్రతం, బాబా హారతులు, సత్సంగ ప్రసంగాలు ఉంటాయని వివరించారు.

● బై బై గణేశా!



కైకలూరులో వినాయకుడి ఊరేగింపు



గుడివాడ రూరల్ మండలంలో..

గణపతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల గ్రామోత్సవాలను శనివారం చేపట్టారు. తీన్‌మార్ డప్పులు, డీజే సౌండ్స్, వివిధ శక్తి వేషధారణలతో బై బై గణేశా అంటూ భక్తులు సందడి చేశారు. వినాయక పందిళ్లలో లడ్డూలకు వేలం నిర్వహించారు. ఆదివారం పందిళ్ల వద్ద అన్నసమారాధన నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మరి కొన్ని మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు.

– కైకలూరు/పామర్రు/గుడివాడరూరల్/గుడివాడటౌన్/పమిడిముక్కల/తోట్లవల్లూరు



తోట్లవల్లూరులో వినాయకుని గ్రామోత్సవం



హరిద్ర గణపతిగా స్వామి వారు



గుర్రాల్లంకలో..

అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్లను అందజేశారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులను పిలిచి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

గడప వద్దకే పథకాలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందిస్తున్నామన్నారు. గతంలో ఏనాడు లేని విధంగా సంక్షేమ పథకాలు అందటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యా కానుక, రైతు భరోసా, ఇంటి వద్దకే పింఛన్ వంటి అన్ని పథకాలు ప్రజల గడప వద్దకే అందిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన చిన్న సమస్యను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తున్నామన్నారు. మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా నన్ను మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తాన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీలు జాజుల శ్రీనివాసరావు, చదలవాడ పద్మజ, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీఓ యద్దనపూడి రామకృష్ణ, గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, పార్టీ గ్రామ కన్వీనర్ మండవ జానకరామయ్య, ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సౌకర్యాలు భేష్

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో సౌకర్యాలు బాగున్నాయని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ అన్నారు. శనివారం ఆమె గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుస్తకాలు, ఇతర వసతులు నిర్వాహణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలో గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రంథాలయాలు డిజిటలైజేషన్ వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు. పాఠకులకు అవసరమైతే మరిన్ని పుస్తకాలనుఅందుబాటులోకి తీసుకువస్తామన్నారు. గ్రంథాలయ నూతన భవన నిర్మాణంపై కూడా దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు ప్రవల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న జమల పూర్ణమ్మ

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

గుడివాడటౌన్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ హెచ్చరించారు. ఆయన పట్టణంలోని 21, 25, 26, 28 వార్డు సచివాలయాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. అటెండెన్స్ రికార్డు, ఇతర వివరాలు పరిశీలించి ఇద్దరు సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 21వ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, 28వ వార్డు ఎమినిటివ్ సెక్రటరీలకు ఈ నోటీసులు అందజేశారు. అనుమతి లేకుండా గైర్హాజరు కావడం, మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడం కారణంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యతా రాహిత్యాన్ని సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు.



తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

జగనన్న ఆరోగ్య సురక్షను జయప్రదం చేయండి

పమిడిముక్కల: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను జయప్రదం చేయాలని డీఎల్‌ఓ భరత్ తెలిపారు. అగినపర్రు సచివాలయంలో శనివారం వైద్య సిబ్బంది, వలంటీర్లకు ఆరోగ్య సురక్ష సర్వేపై జరిగిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఏఎన్ఎంకు తెలియజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేయాలన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారికి టోకెన్ అందజేసి ఆరోగ్య శిబిరాలకు తీసుకురావాలని సూచించారు. వలంటీర్లను సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కతూర, ఏఎన్ఎం కొల్లూరి జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, ఎంఎల్ఓలు అశోక్, రాజు, శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఓ భరత్

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యంగా పాలన

పామర్రు: పరిశుభ్రమైన గ్రామాల ఏర్పాటే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లకు డస్ట్‌బిన్‌లు, ఫాగింగ్ మిషన్లను శనివారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటానికి ప్రతీ ఇంటికి ఒక డస్ట్‌బిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. ఇంట్లోని వ్యర్థాలను దానిలో వేసి చెత్త బండికి ఇవ్వాలని సూచించారు. అంతే కాకుండా 15 ఫాగింగ్ మిషన్లను ఆయా సచివాలయాలకు అందించామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్య రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ టి.శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ ఎం.సురేష్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఏ.శ్రీనాథ్‌రెడ్డి,సర్పంచ్‌లు,కార్యదర్శులుపాల్గొన్నారు.



డస్ట్‌బిన్లు, ఫాగింగ్ మిషన్లను అందజేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

ఘనంగా ప్రపంచ సాంకేతిక భాషా దినోత్సవం

ఎలకుర్రు(పామర్రు): మండల పరిధి ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చియ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో శనివారం ఘనంగా ప్రపంచ సాంకేతిక భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపాధ్యాయుని బి.రాధిక పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేడీబీ ట్రస్ట్ నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, కేడీబీ స్పెషల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.వసుంధర పాల్గొన్నారు.



ఎలకుర్రులో మాట్లాడుతున్న రాధిక

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

కోనేరుసెంటర్: రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో లైఫ్ స్కిల్ ట్రైనర్, ఆంగ్ల విభాగం అధిపతి డాక్టర్ ఎం. కోటేశ్వరరావు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తమ సబ్జెక్టులో ఎలా ప్రతిభ చూపాలి, భవిష్యత్‌ను ఎలా మలుచుకోవాలి తదితర అంశాలను వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తోట్లవల్లూరు: మండలంలోని రొయ్యూరులో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు. గ్రామంలోని ఇసుక ర్యాంపు నుంచి శుక్రవారం రాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సిబ్బంది పట్టుకున్నారన్నారు. ట్రాక్టర్‌కు రూ.5 వేల జరిమానా విధించామని చెప్పారు.